క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో చినకాకాని జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు దాతలు నోటు పుస్తకాలను గురువారం అందజేశారు. సుమారు 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను దాతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రమేష్ పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రదర్శన



దుగ్గిరాల: మండలంలోని అన్ని గ్రామాల రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను ప్రదర్శనకు ఉంచామని.. రైతులు ఆ జాబితాలో పేర్లను పరిశీలించుకోవాలని ఏఓ ఆర్.విజయబాబు అన్నారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో గురువారం ఆయన ఆస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా కేంద్రంలోని 27 రకాల రిజిష్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కౌలు రైతులకు కౌలు రైతు కార్డులను అందించారు. రైతులు తమ పేర్లు అర్హుల జాబితాలో లేనియెడల ఈ నెల 13వ తారీకు వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్స్‌లో శిక్షణ

తాడేపల్లి రూరల్: ఈనెల 26 నుంచి నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్స్ (శాప్ ఎస్‌డీ)లో శిక్షణ ఇవ్వనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాలో ఏదైనా డిగ్రీ చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ కోర్సును పూర్తిగా ఉచితంగా అందజేయనున్నామని తెలిపారు. అనుభవం గల అధ్యాపకులతో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని అన్నారు. మంగళగిరిలోని రత్నాల చెరువు వద్ద, తాడేపల్లిలోని డిమార్ట్ వద్ద ఉన్న రామ్‌స్నేహ ఎన్‌క్లేవ్‌లోని మానవ సేవా సంస్థ కార్యాలయాల్లో శిక్షణ ఉంటుందని, వివరాలను 99852 22857, 98482 39369, 98666 34866 నెంబర్లును సంప్రదించాలని కోరారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు



తాడికొండ: బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో గురువారం తుళ్లూరులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి సీఈవో కృష్ణయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రికి ప్రతి రోజు 1500 మంది హైదరాబాద్‌కు క్యాన్సర్ చికిత్స నిమిత్తం విచ్చేస్తుంటారని.. పేషెంట్ వెంట ఉండేందుకు ఒక వ్యక్తికి వసతి అవకాశం కూడా ఇస్తున్నామన్నారు. స్థానికంగా మరో ఆసుపత్రి ఏర్పాటు చేసేందుకు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం ఎర్రబాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం జరగనుందని సీఈవో తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లి రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ మంగళగిరి డిపో పరిధిలోని మంగళగిరి పరిసర ప్రాంత ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు శుక్రవారం మంగళగిరి డిపో కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పిచ్చియ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సూచనలను, సలహాలను 99592 25424 నెంబరుకు తెలియజేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు కమిషనర్ అలీంబాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్ల మరమ్మతుల కారణంగా 18, 20, 21, 23 వార్డులలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. శుక్ర, శనివారాల్లో నీటి సరఫరా ఉండదని.. ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.



జీఆర్ ప్రభుత్వ పాఠశాలలో పని చేయని ఆర్వో ప్లాంటు



కూటమి నాయకులకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ బాటిళ్లు

ప్రభుత్వ పాఠశాలల్లో దాహం కేకలు!

- మరమ్మతుల్లో ఆర్వో ప్లాంట్లు
- ఇంటి నుంచి వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు రక్షిత మంచినీరు అందించాలని.. పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మరికొన్ని పాఠశాలల్లో పరిశుభ్రత లేదని.. మరుగుదొడ్లు సరిగా లేవని.. ఈ వర్షాకాలంలో రోగాల బారిన పడకుండా పరిశుభ్రంగా ఉంచాలని సమావేశంలో పాల్గొన్న అధికారులకు, కూటమి నాయకులకు తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు.

పర్యవేక్షణ కరువు..

మంగళగిరిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు పాఠశాలల్లో తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇంటి వద్ద నుంచి మంచినీళ్ల బాటిల్స్‌ను తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పాఠశాలల్లో తాగునీరు అందించే కొళాయి టాపన్లు పీకివేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు నేడు పథకం కింద చాలా వరకు పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లను నెలకొల్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఆర్‌వో ప్లాంట్లపై పర్యవేక్షణ లేకపోవడంతో అవి మరమ్మతులకు గురయ్యాయి. నేడు ఆ ప్లాంట్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

కూటమి నాయకులకు మినరల్ వాటర్..

నగర పరిధిలోని సీతారామ కోవెల వద్ద ఉన్న బీహెచ్‌ఎల్ పాఠశాలలో సమావేశానికి హాజరైన కూటమి నాయకులకు మినరల్ వాటర్ బాటిల్స్‌ను స్టేజీ మీద తాగేందుకు ఉంచారు. కనీసం ఆ పాఠశాలలో విద్యార్థులకు మాత్రం మంచినీరు సదుపాయం కల్పించలేకపోయారు. మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగా లేకపోవడం, పరిశుభ్రత లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు విన్నవించుకున్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గుడిమెట్ల పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. ఆ పాఠశాలలో గురువారం ఆత్మీయ సమావేశంలో విద్యార్థులు తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అధికారులు ప్రభుత్వం కొత్త పాఠశాల మంజూరు చేస్తుందని అప్పటి వరకు వేరే ప్రదేశానికి ఈ పాఠశాలను మారుస్తామని తెలియజేశారు.



తాగునీరు అందించే కొళాయిలకు ట్యాపులు లేని దృశ్యం

నీళ్లు లేక వెనుదిరిగి..

పాత మంగళగిరి జీఆర్ స్కూల్‌లో గురువారం విద్యార్థులు దాహార్తిని తీర్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో ఓ చిన్నారి ఇంటి వద్ద నుంచి తీసుకొచ్చిన బాటిల్లో నీరు తాగుతుండగా మరో ఇద్దరు చిన్నారులు అదే బాటిల్లో నుంచి మంచినీరు కోసం ఎదురు చూశారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రుల కోసం, ఉపాధ్యాయుల కోసం బయట నుంచి వాటర్ క్యాన్లు తెప్పించారు. అవి కూడా అరాకొర తెప్పించడంతో మంచి నీరు కరువైయ్యింది. ఓ విద్యార్థిని దాహంతో ఆ వాటర్ క్యాన్ల వరకు వచ్చింది. ఆ క్యాన్‌లో నీరు లేకపోవడంతో నిరుత్సాహంగా వెనుదిరిగింది.



దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చిన చిన్నారి

కనులపండువగా గురు పూర్ణిమ వేడుకలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



తాడికొండలో ప్రత్యేక అలంకరణలో సాయి



ఆశ్రమ పీఠాధిపతులను సత్కరిస్తున్న రమేష్‌బాబు దంపతులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై గురువారం గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్‌స్వామి వారికి అభిషేకం చేశారు. 9.30 గంటలకు లక్ష్మీ హయగ్రీవ హోమాలు.. 10.30 గంటలకు ఆచార్య పాదుకారాధన, అష్టోత్తర శతనామార్చన, అనంతరం మంగళా శాసనములు నిర్వహించారు. కార్యక్రమంలో జీయర్‌ఎడ్యుకేషన్ ట్రస్ట్ వేద విద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దుగ్గిరాలలోని రైలుపేట సాయిబాబా మందిరంలో బాబాకు గురువారం గురుపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. సాయిబాబాను ఉదయం నుంచే భక్తులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వహించారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సొలస స్టాండ్ సెంటర్లో షిర్డి సాయి నాథుని మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలను మేళతాళాల నడుమ భక్తులు శిరస్సుపై పెట్టుకుని ఊరేగించారు. అనంతరం స్వామికి పంచామృతాలు, 108 కలశాలలోని జలాలతో అభిషేకాలను అర్చకులు నరసింహమూర్తి, అజయ్‌కుమార్‌లు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను యెండ్రెడ్డి యల్లారెడ్డి, యండ్రెడ్డి శ్రీనివాసరెడ్డిలు పర్యవేక్షించారు.

తాడికొండ: గురుపౌర్ణమిని పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరు మండలాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడికొండలో ప్రసిద్ధి గాంచిన షిర్డీ సాయి పర్తిసాయి మందిరంలో విశేష పూజలు చేశారు. అన్న సంతర్పరణ కార్యక్రమానికి భక్తులు వేలాదిగా పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. పొన్నెకల్లు, మోతడక, తుళ్లూరుతో పాటు పలు గ్రామాల్లోని షిర్డీసాయి బాబా ఆలయాలకు భక్తులు అధికంగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

తాడేపల్లి రూరల్: కొప్పురావు కాలనీలోని శ్రీ గురు దత్తాత్రేయ ఆశ్రమంలో గురువారం గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆశ్రమ వ్యవస్థాపక పీఠాధిపతులు స్వర్గీయ నాగమాంబకు శిష్య బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమ ప్రస్తుత పీఠాధిపతులు పోలంకి చిన్న సుబ్బారావు గురువును స్థానిక మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, శ్రీమతి అనిత దంపతులు శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్య బృంద ప్రతినిధులు తలశీల జయలక్ష్మి, మన్నెం విజయ, ఆలూరి వాసంతి, రామినేని సులోచన తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో పశుగ్రాస వారోత్సవాలు



ఫిరంగిపురం: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. నాణ్యమైన పశుగ్రాసంతో పాల ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ రాయితీలపై లభ్యమయ్యే పథకాలు వాటి ఉపయోగాలను వివరించారు. పశుగ్రాసాల్లో రకాలు వాటిని వాడటం ద్వారా కలిగే లాభాలు గురించి పాడి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎస్‌డీపీ ఏడీ డాక్టర్ టి.మోహన్‌రావు, పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

రాజధాని పారిశుద్ధ్య కార్మికులకు సామాజిక పింఛను ఇప్పించాలి

సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసిన రాజధాని పారిశుద్ధ్య కార్మికులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తాడికొండ: రాజధాని పేదలకు అందించే సామాజిక పింఛను తమకు ఇప్పించండి అంటూ రాజధానిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో సుపరిపాలన–తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేను కలిసిన కార్మికులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గతంలో తమకు సామాజిక పెన్షన్ వచ్చేదని.. ప్రభుత్వం నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలతో పోల్చుకుంటే ప్రభుత్వం ఇస్తున్న జీతాలు సరిపోవడం లేదని, తమ జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సంఖ్య తగ్గడంతో తమకు పని భారం పెరిగిందని.. ఆ సంఖ్యను పెంచాలని తెలిపారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారం నాటికి 219వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్, సాంబయ్య, యెహోషువా, ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులు బుధవారం నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతం అయ్యిందని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రమాదేవి, దుర్గాంబ, గురవయ్య, పిచ్చయ్య, నాగేశ్వరరావు, సుబ్బారావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



బహుమతులు అందజేస్తున్న సీఐ శివరామకృష్ణ, వీరయ్యలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి, తాడేపల్లి పట్టణ, తాడేపల్లి రూరల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశాన్ని పాఠశాల సమస్యలను చర్చించడంతో పాటు పిల్లలు ఏ విధంగా చదువుతున్నారనే విషయాలను చర్చించేందుకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పలుచోట్ల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీని అందజేశారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువులను ఘనంగా సత్కరించారు. ఏ పాఠశాలలో ఏ సమస్యలు ఉన్నాయని చర్చ మాత్రం ఎక్కడా పెద్దగా కనిపించలేదు. కమిటీ సభ్యులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులను కమిటీ సభ్యులు, వీరిద్దరు కలిపి కూటమి నాయకులను పొగిడారనే విమర్శలు వినిపిస్తున్నారు. గుండిమెడలో జరిగిన పీటీఎం 2.0 కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మాజీ మండల అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ విచ్చేశారు. వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమానికి కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ బి.నాగమ్మ ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. విద్యాకమిటీ చైర్మన్ షేక్ భసీరున్నీసా, వైస్ ప్రెసిడెంట్ జె.శ్రీదాస్, మాజీ సర్పంచ్‌లు కె.మధు, ఈ.బాబులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు.

తాడేపల్లిలో..

తాడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాడేపల్లి ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లి తహసీల్దార్ డి.సీతారామయ్య హాజరయ్యారు. తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మంజరి, ప్రజా ప్రతినిధులు ధారా దాసు, ఇట్టా పెంచలయ్య, ఓలేటి రాములు, ఇట్టా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. కుంచనపల్లిలో ఎంపీయూపీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ టీడీపీ, జనసేన పార్టీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, మేకల రాజాలు హాజరైయ్యారు.

దుగ్గిరాల: మెగా పేరెంట్స్ టీచర్స్ 2.0 కార్యక్రమాలను దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాల, ఈమని శిశుమందిర్ స్కూల్, డా.కె.కె.ఆర్.ఎం డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో హెచ్.ఎం.యస్.శోభాదేవి, హెచ్.ఎం జి.సంధ్యారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: బాలల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని వసంతగర్ పాఠశాలలో గురువారం బడిపండుగ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అల్లంవారిపాలెం జెడ్పీ పాఠశాలలో బడిపండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాలలు పర్యావరణ ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మహబూబ్ సుభాని, రవికుమార్, ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు పి.ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫిరంగిపురంలోని ఆర్‌జేసీ కళాశాలలో బడిపండుగ కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ పాల్గొని మాట్లాడారు. కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులకు తాడులాగు పోటీలు, మ్యూజికల్ కుర్చీ పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి సీఐ శివరామకృష్ణ, పి.వీరయ్యలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుదర్శన్, రిటైడ్ పీడీ పి.హృదయరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.


శాకంబరీ... నమోస్తుతే..



తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో..



మారీసుపేటలోని శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ..



రామలింగేశ్వరపేట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో..

జగదంబ ఆషాఢమాసం సందర్భంగా భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని వేర్వేరు దేవాలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లను కూరగాయలు, పండ్లతో చక్కగా అలకరించారు. చక్కని వర్షాలు కురిసి, పాడి–పంట సమృద్ధిగా ఉండాలంటూ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులకు కిక్కిరిసి కనిపించాయి.

– తెనాలి

బీమా సౌకర్యాన్ని రైతులు పొందాలి

తెనాలి: మండలంలోని రైతులందరూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా కింద వరి, మినుము పంటలకు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సుధీర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 31వ తేదీలోగా రైతు సేవాకేంద్రాలు లేదా బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి బీమా రక్షణ పొందాలని సూచించారు. వరి పంటకు ఎకరాకు రూ.800, మినుముకు రూ.200 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటర్మీడియట్ దశ అత్యంత ముఖ్యం



తెనాలిటౌన్: ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత ప్రాముఖ్యమైనదని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక నాజర్‌పేటలోని సెయింట్ పాల్స్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ నందు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా న్యాయవాది కరీముాన్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమం నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎంఎ లింకన్‌బాబుమాట్లాడుతూ విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా పిల్ల లు భవిష్యత్‌లో కలిగే ఉపాధి అవకాశాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాలసెక్రటరీ ఆర్.షీలా సుజని, అధ్యాపకులు డాక్టర్ స్వేచ్ఛ, కీర్తి, అబ్రహాం, ఉష, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏసురత్నం చిరస్మరణీయుడు



తెనాలి: అభ్యుదయ భావాలు కలిగిన మానవతావాది, దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం 70వ జయంతిని గురువారం రాత్రి ఇక్కడి ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ సేవాట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. కనపర్తి ఏసురత్నం ఆర్గానిక్ ఇంటలెక్చువల్ ఎలా అయిందీ, ఆయన ఉద్యమ సరళి, సాంస్కృతిక సహకారం, గ్రామాల్లోని పేదలకు చేసిన సహాయాలు, కులమతాలకు వ్యతిరేకంగా మరీ ముఖ్యంగా కొల్లిపర ప్రాంతంలో దళిత, వామపక్ష భావాలతో పనిచేసి, అమరుడైన ఏసురత్నం చిరస్మరణీయులనీ, ఆయన ఉద్యమ జీవితం యువతకు ఆదర్శమని పలువురు వక్తలు స్మరించుకున్నారు. జమ్మూల రమేష్, బేతాళ కృష్ణమోహన్,అక్కిదాసు కిరణ్, కేసీ బసవయ్య, షేక్ చర్ల,జిలుగు పీటర్, బండికళ్ల సతీష్, శశి, పాల్, మధుకర్, ఇమ్మనియల్, డాక్టర్ పిల్లి వాసు, డాక్టర్ అబ్రహం లింకన్ మాట్లాడారు.

గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంగళగిరి
యఫ్.డి.ఐ.ఎ.నెం.154/2024
ఒ.ఎస్.నెం.453/2022
పిటీషన్ :
కాజ నాగమల్లేశ్వరి ...పిటీషనర్/వాది
మరియు
కాజ సామ్రాజ్యలక్ష్మి
వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన కాజ ... S/o. ..., కొత్తపేట, శివాలయం వెనుక మంగళగిరి, గుంటూరు జిల్లా వారికి పై కోర్టులో ది.06.08.2025 వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ అభ్యంతరాలు తెలియ పర్చుకొనవచ్చును. లేని యెడల సదరు ఫైనల్ డిక్రీ పిటీషన్ తమ పరోక్షమున విచారణ చేయబడగలదని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.
అవుల ...
పుప్పాల రామకృష్ణ
మంగళగిరి
ది.11.07.2025 అడ్వకేట్స్, మంగళగిరి